www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 30 నవంబర్ 2022

5

తూర్పుగోదావరి



ఆత్మీయ సమ్మేళనంపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వివటం రోడ్డులోని స్పిన్నింగ్ మిల్లు రైలు గేటు వద్ద మంగళవారం చదలవాడ నాని, చెట్టె సుజనరావు ఫ్రెండ్స్ టీం ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంపై తెనెటీగలు దాడి చేశాయి. భారీ స్థాయిలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఎ.రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ టివి.రామారావు, ఉండ్రాజవరం జడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.వెంకటసుబ్బారావు తదితరులు హాజరయ్యారు. వారంతా భోజనాలు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో పరుగులు తీశారు. పలువురు స్వల్ప గాయాలపాలయ్యారు. స్థానికంగా వైద్యం తీసుకోవడంతో ప్రమాదం తప్పిందని ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం. రాజేశ్వరరావు తెలిపారు.

కళల పరిరక్షణ అందరిబాధ్యత

జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల్లో మంత్రి ఆర్‌కె.రోజా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి ఆర్‌కె.రోజా అన్నారు. మంగళవారం ఆనం కళాకేంద్రంలో మూడు రోజులు పాటు జరిగే 'జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు' జోనల్ స్థాయి కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకల్ని ప్రారంభించారు. హోం మంత్రి తానేటి వనిత, పౌరసరఫరాలు శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపి భరత్‌రామ్, మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, రుడా చైర్మన్ ఎం.షర్మిళారెడ్డి, ఎంఎల్‌ఎలు జక్కంపూడి రాజా, కురసాల కన్నబాబు, సాంస్కృతిక శాఖ చైర్మన్ వంగపండు ఉష, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో జగనన్న స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నాలుగు జోన్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఇప్పటికే తిరుపతి, గుంటూరు పట్టణాల్లో జరుపుకోగా, నేడు రాజమహేంద్రవరంలో జరుపుకుంటున్నామన్నారు. ఈ వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ నగరంలో ఎంతో మంది కవులు కళాకారులు, సంఘ సంస్కర్తలు జన్మించారన్నారు. తెలుగు భాషకు అంకురార్పణ చేసిన ఆదికవి నన్నయ్య ఈ ప్రాంతం వారే కావడం గర్వకారణమన్నారు. గోదావరి భాషకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. సినీరంగంలో ఎంతో మంది కళాకారులు అల్లు రామలింగయ్య నుంచి ఆలీ, మెగాస్టార్ చిరంజీవి నుంచి రెబల్ స్టార్ కృష్ణంరాజు వరకు ఎస్‌పి.రంగారావు నుంచి గిన్నీసు బుక్‌లో నమోదైన దర్శకరత్న దాసరి నారాయణరావు, జయప్రద, భానుప్రియ ఈ గోదావరి ప్రాంతం నుంచి వచ్చిన వారేనని పేర్కొన్నారు. పేద , ఔత్సాహిక కళాకారులను గుర్తించడం కోసం ఇటువంటి కార్యక్రమాలు చేస్తుంటే కొంత మంది వీటినీ విమర్శించడం శోచనీయమన్నారు. ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. దేశంలో ప్రధానితో పాటు అన్నిప్రాంతాల వారు రాష్ట్రం వైపు చూసే విధంగా సిఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు.

హోం మంత్రి వనిత మాట్లాడుతూ, సాంస్కృతిక శాఖా మంత్రిగా రోజా తనదైన ముద్రతో సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. పేదరికంలో బాధపడుతున్న కళాకారులకు జగన్ చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ అంబేద్కర్ కోరిన విధంగా సమసమాజ స్థాపన కోసం పేదరికమే అర్హతగా కులమతాలకతీతంగా జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఘన చరిత్ర కలిగిన రాజమహేంద్రవరంలో ఇలాంటి సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండటమే కాకుండా, ఇటువంటి సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తూ కళాకారులను, కళలను, సాహిత్యాన్ని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు.

ఎంఎల్‌ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ సిఎం అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గోదావరి జిల్లా చరిత్రను ఇనుమడింప చేసే విధంగా మ్యూజియంను ఏర్పాటు చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. రాజానగరం ఎంఎల్‌ఎ రాజా మాట్లాడుతూ కళాకారులను ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సహిస్తుందన్నారు. వివిధ ప్రాంతాల్లోని కళాకారులను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం రుడా చైర్పర్సన్ షర్మిలారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడారు. సాంస్కృతిక వ్యవహారాల శాఖ చైర్మన్ వంగపండు ఉష తన దైన శైలిలో 'ఏంపిల్లా ఎల్దామొస్తవా" అంటూ ఆలపించిన గేయం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, సంగీత కళాశాల ప్రిన్సిపల్ ఎం.కృష్ణమోహన్, నాట్యాచారుడు పి.శ్రీనివాసశర్మ, కళాకారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రోజా

ప్రాంగణంలో కళాకారుల ప్రదర్శన

విద్యాదీవెన కంటి తుడుపేనా?

ఏడాది ఆలస్యంగా ఫీజులు విడుదల
ఆర్థిక ఇబ్బందుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యా దీవెన పథకం కంటితుడుపేనని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం విద్యాదీవెన పథకం పేరుతో లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమచేయనుంది. అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 31,899 మంది తల్లుల ఖాతాల్లోకి 35,818 విద్యార్థులకు సంబంధించిన విద్యా దీవెన నిధులు రూ.23.18 కోట్లు జమ చేయనుంది. గత నెలలో విద్యా దీవెన సొమ్మును విడుదల చేస్తారని అంతా ఆశించారు. అయితే సాంకేతిక కారణాలతో ఆలస్యమైందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లమో, ఇంటర్ విద్యార్థులకు 2021-22 చివరి క్వార్టర్‌కు సంబంధించిన నిధులు తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం 2022-23 విద్యా సంవత్సరం ముగింపు దశలో ఉంది. ఈ ఏడాదికి సంబంధించి మూడు క్వార్టర్లు దాటిపోతున్నాయి. ఈ లెక్కల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏడాది ఆలస్యంగా విద్యాదీవెన అమలు చేస్తుందని స్పష్టమవుతోంది. మరో వైపు 2019-20కి సంబంధించిన బకాయిలు ఇప్పటికీ చెల్లించలేదు. 2021-22 రెండో క్వార్టర్ బకాయిలకు బదులుగా ప్రస్తుతం మూడో క్వార్టర్ నిధులు విడుదల చేస్తోంది. ప్రభుత్వ తాత్సారం ఫలితంగా ఫీజు రియంబర్స్ విధానం గందరగోళంగా మారింది. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కళాశాల చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పెను భారంగా మారుతోంది. జిల్లాలో అనేక కళాశాలలు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు ఫీజులు బకాయిలు చెల్లించనిదే సర్టిఫికేట్‌లు ఇవ్వడం లేదు. అప్పటి వరకూ ఉన్న బకాయిలను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీంతో గత్యంతరం లేక సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

ఒక క్వార్టర్‌కు సుమారుగా జిల్లాలో రూ.23.08 కోట్లు ఫీజులు చెల్లించాలి. ప్రభుత్వం సంవత్సరాల తరబడి నిలిపివేయడంతో 2022-2023 విద్యా సంవత్సరం మూడు క్వార్టర్లకు సంబంధించి అక్షరాలా రూ. 75 కోట్ల విద్యార్థులపై భారం పడింది. విద్యా దీవెనతో పాటు, వసతి దీవెనను సైతం ప్రతి ఏటా అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం విదితమే. అయితే ఇప్పటికి మూడు విద్యా సంవత్సరాలు గడిచినా పూర్తి స్థాయిలో ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఫీజుల వసూళ్ల ప్రక్రియలో నిరంకుశంగా వ్యవహరిస్తున్న కాలేజీ యాజామాన్యాలపైనా ప్రభుత్వ పర్యవేక్షణ కొరవటడంతో విద్యార్థులలో ఆందోళన వ్యక్తమవుతోంది. .

మేనిఫెస్టోలో ప్రకటించినా...

2019-20,2021-22 సంవత్సరానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. తాజాగా 2021-2022 మూడో క్వార్టర్ ఫీజు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. ఇది సరైంది కాదు. బకాయిలు చెల్లించాలి లేదా అప్పటి కాలేజీ ఫీజులను రద్దు చేయాలి.విద్యా దీవెనతో పాటు వసతి దీవెన అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ సైతం పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవటం లేదు. ఫీజులు కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలి.

- ఎన్ రాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదరి

బాబు యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తాళ్లపూడి

డిసెంబర్ 1న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్వహించే యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ పిలుపునిచ్చారు. టిడిపి మండల శాఖ అధ్యక్షులు నామన పరమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వీరు మాట్లాడారు. చంద్రన్న రూట్ మ్యాప్‌పై పరిశీలన చేశారు. మండలంలోని తాడిపూడి నుంచి గోదావరి గట్టు మీదుగా కొవ్వూరు వరకు బాబు యాత్ర జరుగుతుందన్నారు. అనంతరం కొవ్వూరు విజయవిహార్ సెంటర్లో బహిరంగ సభలో బాబు మాట్లాడతారని తెలిపారు. తాడిపూడి, సమీప గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో యాత్రలో పాల్గొనాలన్నారు. మిగిలిన వారు నేరుగా కొవ్వూరు చేరుకునేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చంద్రబాబు యాత్ర మండలంలోని అన్ని గ్రామాల మీదుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆత్కూరి రాంబాబు, చెరుకూరి సత్యనారాయణ తదితర నాయకులు కోరారు. ఈ సమావేశంలో టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు రాపాక తిలక్, కె.శ్రీనివాస్, కె.వెంకట్రావు, బి.కాశి, మాజీ ఎంపిపి కోట్నీస్, బిసి నాయకులు కె.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా పాస్టర్స్ ఫెలోషిప్ ఐక్య క్రిస్మస్

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలో యర్నగూడెంలో ఆర్ కన్వెన్షన్ హాల్లో గోపాలపురం నియోజకవర్గ పాస్టర్స్ ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ షేక్ గఫూర్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే ఈ సంవత్సరంలో తొలి క్రిస్మస్ సభ అని, ప్రజలకు సేవ చేయుటకు దేవుడిచ్చిన అవకాశం అని అన్నారు. ముఖ్య ప్రసంగీకులు రెవ డాక్టర్ జోహాని హలోనిన్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ట్రెజరర్ రెవరెండ్ టాటా విక్టర్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ రెవరెండ్ మోజెస్‌బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ శ్యాంబాబు, జాయింట్ సెక్రటరీ రెవరెండ్ తానేటి రాజు, ఎఐసిసి గోపాలపురం రీజియన్ అధ్యక్షులు సామ్యూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పాస్టర్లు పాల్గొన్నారు.

'గోపాలపురం' పరిశీలకునిగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -దేవరపల్లి

గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిశీలకులుగా విశాఖ స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావును ముఖ్యమంత్రి జగన్ నియమించారు. నియోజవర్గంలోని వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, వెంకటేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.

రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని తాతపూడి సమీపంలో గోదావరి ఏటి గట్టుపై ఉన్న పంపింగ్ స్కీం భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఈ గోడ తుపాను ఉధృతికి నేలమట్టమైంది. దీంతో అప్పటి నుంచి రక్షణ కరువైంది. నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీంను వినియోగిస్తారు తప్పమిగిలిన రోజుల్లో కన్నెత్తి చూడట్లేదని స్థానికులు చెబుతున్నారు. రక్షణ గోడ బదులు కర్రలను ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో ఈ పంపింగ్ స్కీంలో ఉన్న సామగ్రి చోరీకి గురైన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. విలువైన మోటార్లు ,సామాగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గోపాలపురం

2022-23 సంవత్సరానికి యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.శంకరుడు, జిల్లా కార్యదర్శి బి.విజయబాబు తెలిపారు. సోమవారం గోపాలపురం జెబి స్కూల్‌లో మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు శంకరుడు హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి బి.విజయ్ బాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఉపాధ్యా యుల సమస్యలపై సంఘం చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఉద్యోగులకు పాత డిఎలు వెంటనే మంజూరు చేయాలని, బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా జి.రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.జానుబాబు, ఉపాధ్యక్షులుగా ఎం.నాగేశ్వరరావు, మహిళా అధ్య క్షులుగా కె.ఝాన్సీరాణి, కోశాధికారిగా సిహెచ్.సూర్యచంద్రం ఎన్నికయ్యారు.

ప్రమాణ స్వీకారంచేస్తున్న నూతన కార్యవర్గ

కౌలురైతులను ఆదుకున్న ఘనత పవన్‌దే...

ప్రజాశక్తి-కడియం

ఆత్మహత్య చేసుకున్న మూడువేల మంది కౌలురైతులను ఆదుకున్న ఘనత జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కే దక్కిందని ఆ పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం దామిరెడ్డిపల్లిలో జరిగిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటం గ్రామంలో జనసేన ఆవిర్భావ సభ పెట్టుకోవడానికి స్థలం ఇచ్చిన 53 మంది రైతుల ఇల్లు కూల్చివేస్తే, నష్టపోయిన రైతులను పవన్ కళ్యాణ్ ఆదుకున్నారన్నారు. జరగబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఓటు విలువను పెంచే విధంగా నడుచుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎస్‌పి నాయకులు ముద్రగడ జమ్మి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలోవ ముంపు నివారణ చర్యలకు శ్రీకారం

స్టార్మ్ వాటర్ కాలువ నిర్మాణ పనులకు మంత్రి రోజా శంకుస్థాపన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తుమ్మలోవ ముంపు నివారణ చర్యలకు మంత్రి రోజా శ్రీకారం చుట్టారు. తుమ్మలావ అంబేద్కర్ భవనం వద్ద దేవీ చౌక్ నుంచి నల్లా చానెల్ వరకూ రూ. 2.38 కోట్లతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ కాలువ పనులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా మంగళవారం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన శిలా ఫలకాన్ని మంత్రి రోజా, ఎంపీ భరత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యగా ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత నివావరణ చేపట్టాలని సిఎం జగన్ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా కాలువ నిర్మాణానికి నిధులను మంజూరు చేశారని తెలిపారు. వచ్చే ఆరేడు నెలల్లోనే ఈ కాలువ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఇకపై గోదావరి నదికి ఎప్పుడు వరదలొచ్చినా, వర్షం వచ్చినా తుమ్మలోవ తదితర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్న సమర్థుడైన, విద్యావంతుడైన యువకుడు ఎంపీ భరత్ నేతగా ఉండటం నగర ప్రజల అదృష్టమన్నారు. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా ఈ సమస్యపై దృష్టి పెట్టలేదంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించకుండా అధికారం కోసం అర్రులుచాచే నాయకులకు, ఆ ప్రభుత్వాలకు సమయం వచ్చినప్పుడు ప్రజలే బుద్ధిచెబుతారనడానికి టిడిపి ఒక నిదర్శనమన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న జగనన్న, ఎంపీ భరత్‌కు నగర ప్రజల అభిమానం, మద్దతు ఎప్పుడూ ఉండాలని రోజా కోరారు. ఈ కార్యక్రమంలో రుడా ఛైర్పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర కమిషనర్ కే దినేష్ కుమార్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్, వార్డు ఇన్చార్జి ప్రసాదుల హరి, నందం స్వామి, జీ రాజు తదితరులు ఉన్నారు

వడ్లూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరులో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలో భాగంగా ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి, 104 వాహన డాక్టర్ జి.సుష్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి, పి.బ్యూలాజాయ్, ఎఎన్ఎం డి.రజనీకుమారి, సూపర్ వైజర్, కె.నాగమణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రావణ్ కుమార్, ఆశాలు పాల్గొన్నారు.

పలువురు జనసేనలో చేరిక

కడియం : మండలంలోని వీరవరానికి చెందిన న్యాయవాది, టిడిపి నాయకుడు ఇనుమర్తి ప్రభాత్ మంగళవారం జనసేన పార్టీలో చేరారు. దామిరెడ్డిపల్లి విచ్చేసిన జెఎస్‌పి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ సమక్షంలో నాయకులు ఆదిమూలం సాయిబాబా, ముద్రగడ జమ్మి ఆధ్వర్యంలో సుమారు 100 మంది అనుచరులతో ప్రభాత్ జెఎస్‌పి తీర్థం పుచ్చుకున్నారు. దుర్గేష్ వారికి కండువాలు కప్పిన పార్టీలోకి ఆహ్వానించారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

ధవళేశ్వరం : ధవళేశ్వరంలో రైతులకు సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ విద్యార్థి బొత్స సంతోష్ తెగుళ్ల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్పిరియన్స్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటలకు ఆశించే పురుగులు, తెగుళ్లను ఎలా నివారించాలో చార్ట్ రూపంలో ప్రదర్శించి వివరించారు. అధిక దిగుబడి సాధించడానికి తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి టిఒటిల శిక్షణ ప్రారంభం

కడియం : కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి టిఒటి శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డిపిఒ, డిఎల్‌పిఒ పాల్గొన్నారు. ప్రగతి, ప్రణాళిక తదితర అంశాలపై తగు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మండల పరిషత్ అభివద్ధి అధికారులు, మండల విస్తరణాధికారులు, పంచాయతీ కార్యధర్శి (గ్రేడ్-1), ఇతర సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి

తాళ్లపూడి : పురాతన ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పెద్దేవం గ్రామస్తులు నిడదవోలు ఎంఎల్‌ఎ జిఎస్.నాయకుడుకు విన్నవించారు. సుబ్రహ్మణ్యం షష్టి సందర్భంగా ఆయన సొంత స్వగ్రామమైన పెద్దేవానికి మంగళవారం వచ్చారు. ఆలయ అర్చకులు చేబ్రోలు శ్రీరామచంద్రమూర్తి ఆలయ మర్యాదలతో ఎంఎల్‌ఎకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆయన్ని కలిసి అభివృద్ధి కోసం విన్నవించారు.

మొబైల్ అప్‌డేట్‌పై అంగన్‌వాడీలకు అవగాహన

గోకవరం : మండలంలోని రంపయర్రంపాలెంలో అంగన్‌వాడీ సెంటర్-1లో తంటికొండ సెక్టార్ కార్యకర్తలకు సూపర్‌వైజర్ రంజిని ఆధ్వర్యంలో మొబైల్ అప్‌డేట్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఝాన్సీరాణి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను మొబైల్ యాప్‌లో ఎలా ఆన్‌లైన్ చేయాలో అవగాహన కల్పించారు. అంగనవాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం ఆహారం అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం బాలింతలకు పిల్లలకు గర్భిణీలకు పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు ఈ కార్యక్రమంలో తంటికొండ సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవరపల్లి : సమస్యలను పరిష్కరించాలని మండల విశ్రాంత ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు వెంకట రామారావు, కార్యదర్శి బండి సూర్యప్రకాష్‌రావు మంగళవారం జంగారెడ్డిగూడెం సబ్ ట్రెజరీ అధికారి చినబాబుకు విన్నవించారు. అడిషనల్ క్వాంటం పెన్షన్ పత్రాలను ఇచ్చి మండలంలో ఐదుగురికి పెన్షన్ మంజూరు చేయాలని ఎస్‌టిఒను కోరారు. దీనికి ఆయన స్పందించారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ ట్రెజరీ అధికారులకు దేవరపల్లి మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం తరపున కతజ్ఞతలు తెలియజేశారు.

కార్టూ'నిజం'



కార్పొరేట్ సంస్థలకి కొమ్ముగాసి... లబ్ధి చేకూర్చితే ధనిక పార్టీ కాకమరేమవుతుందీ..!

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సుబ్రహ్మణ్యం షష్టి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. సుబ్రహ్మణ్యం స్వామి ఆలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. **బిక్కవోలులో** సుబ్రహ్మణ్యస్వామిని ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంగీత కచేరి చేస్తున్న కళాకారులను ఎంఎల్‌ఎ సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి టౌన్ అధ్యక్షులు రంగంపేట మండలం ఇన్‌ఛార్జి నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, జడ్‌పిటిసి సభ్యులు రొంగల పద్మావతి, పేపకాలయ వెంకటలక్ష్మి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ జంగా వీర వెంకటసుబ్బారెడ్డి, ఎంపిపిలు కేతా తులసి, రిమ్మలపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని దొండపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవానికి టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు మద్దాల కాశీవిశ్వనాథ, పి.సత్యంబాబు, ఎం.వెంకటరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దిపాటిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. **గోకవరం** సమీపంలో ఫజుల్లాబాద్ గ్రామంలో నిర్వహించిన షష్టి వేడుకల్లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంగరౌతు రామకృష్ణ మారిశెట్టి భద్రం, ఉంగరాల గణేష్, బి.అచ్చన్నదొర తదితరులు పాల్గొన్నారు. **కడియం** మండలంలోని జేగురుపాడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకల్లో సినీ హీరో ఆర్యన్ రాజేష్ పాల్గొని సందడి చేశారు. సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఎంపిటిసి సభ్యులు ఆకుల సుధాకర్‌లతో కలిసి దర్శనం చేసుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కంటిపూడి అమర్‌నాథ్, పుట్టా బుజ్జి, రంకిరెడ్డి వీరకష్ణ , గారపాటి సతీష్ , తదితరులు ఆయన వెంట వున్నారు. **ఉండ్రాజవరం**లో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. నిడదవోలు ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస్ నాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రియా సౌజన్య, ఎంపిటిసి కాకర్ల కరుణాకర్, జెఎస్‌పి నాయకులు వీరమల్ల బాలాజీ పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో ఎంఎల్ఎ నాయుడుని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిక్కవోలులో పూజలు నిర్వహిస్తున్న ఎంఎల్ఎ సూర్యనారాయణరెడ్డి

కలెక్టర్‌కు ఎపి ఎన్‌జిఒ అభినందనలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో కాకినాడ జిల్లా అత్యుత్తమ ప్రతిభ సాధించి రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ నుంచి బంగారు పతకాన్ని అందుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆమె అవార్డు అందుకున్న చిత్ర పటంతో అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కత్తిక శుక్లను కలిసిన వారిలో ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సరెళ్ళ చంద్ర రావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి యండమూరి పద్మ మీనాక్షి, కాకినాడ సిటీ అధ్యక్షుడు షేక్ అజీజ్, కార్యదర్శి ఏ సత్తిరాజు, ఆర్ అండ్ బి ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వి నాగేశ్వరరావు, అమరావతి జేఏసీ నాయకులు పితాని త్రినాధరావు, ఎన్‌వి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టర్ ను అభినందిస్తున్న ఎపి ఎన్‌జిఒ నాయకులు

స్వచ్ఛమైన నీటితోనే ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగడం ద్వారానే ప్రజారోగ్యం బాగుపడుతుందని ఆల్పే (ఏఏఎల్‌పిఈ) సంస్థ కోఆర్డినేటర్లు చక్రవర్తి, డేనియల్ అన్నారు. మంగళవారం పెద్దాపురం మండలం కట్టమూరు పంచాయతీ కార్యాలయం వద్ద జల జీవన్ మిషన్‌లో భాగంగా సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం అధ్యక్షతన స్వచ్ఛమైన తాగునీటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షపు నీటిని భూగర్భంలో నిక్షిప్తం చేసి వాటిని పరిరక్షించాలన్నారు. తాగునీటి సంరక్షణపై అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛమైన తాగు నీటిపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

6వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-కరప

మండలంలోని కరప, గొర్రిపూడి, వేళంగి వివిధ గ్రామాల్లో షష్టి మహొత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, జనసేన నాయకుడు పంతం నానాజీ, టిడిపి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు మండలంలోని ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం పెనుగుదురు -కరప రహదారి పక్కన 51 అడుగుల సుబ్రమణ్య స్వామి విగ్రహం ఏర్పాటుకు ఎంఎల్‌సి చిక్కాల రామ చంద్రరావు తమ్ముడు కుమారుడైన చిక్కాల దొరబాబు సొంత స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా ఆరు వేల మందికి అన్నదానం నిర్వహించారు. జిల్లాలో గొర్రిపూడి షష్టి మహొత్సవాలు ప్రత్యేకత ఉంది బాణాసంచా పోటీ కార్యక్రమం చూసేందుకు జిల్లాలో పలు ప్రాంతాల నుండి భారీగా తరలి వచ్చి వేడుకలలో పాల్గొంటారు. పలు సాంస్కతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు చీకాల సుబ్బారావు, చీకాల అప్పల రాజు గండి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి యాద సుబ్బారావు ఎంపిపి పేంకే శ్రీలక్ష్మి, రెడ్డిపల్లి వరరమేష్, నక్కా సత్తిబాబు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద ధర్మకర్త చిక్కల దొరబాబు ఎంఎల్ఎ కన్నబాబు

చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.బెన్నయ్య నాయుడు ఆదేశాల మేరకు నల్సా గైడెన్స్ లో భాగంగా ఈ నెల 26 నుండి డిసెంబర్ 2 తేదీ వరకు నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సుధా కాలనీలోని ఆదిత్య స్కూల్‌లో చట్టాలపై న్యాయ వాదులు అత్తిలి ప్రభూజి, సకురు దుర్గారావు విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, కెవివి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు వివరిస్తున్న న్యాయవాది

నవోదయకు పిబి.దేవం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

2022-23 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పోటీ పరీక్షలో సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం ఎంపిపి పాఠశాలకు చెందిన విద్యార్థి అంకి చైతన్య సంపత్ కుమార్ ఎంపికైనట్లు ఎంఇఒ వై శివరామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి చైతన్య సంపత్ కుమార్‌ను ఎంఇఒ వై శివరామకృష్ణయ్య, గ్రామ సర్పంచ్ నీలపాల సత్య నారాయణ, ఎంపీటీసీ మలకల సూర్యారావు (సూరిబాబు), డాక్టర్ వైవిబి ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చైతన్య సంపత్ కుమార్

విశ్రాంత భవనం ఆధునికీకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పలువురు పాదచారులు, బాట సారులు, ప్రయాణికులు విశ్రాంతి పొందేందుకు నిర్మించిన విశ్రాంతి భవనానికి ఆధునికీకరణ పనులు చేపట్టారు. తాళ్లరేవు మండలం పోలే కుర్రు పి.మల్లవరం సెంటర్ సుంక ట్రేవులో స్థల దాత శ్రీ ధూళిపూడి నమ్మయ్య జ్ఞాపకార్థం గొల్ల బాబు నిర్మించిన విశ్రాంతి భవనాన్ని విళ్ల కృష్ణవేణి ఆధునికీకరించారు. ఈ భవనంలో పలువురు విశ్రాంతి తీసు కోవడం ఆనందంగా ఉందని కృష్ణవేణి అన్నారు. కార్యక్రమంలో గోనెమడతల తల్లి, విళ్ల వెంకన్నబాబు దంపతులు, ధూళిపూడి శ్రీనివాసు, ఉంగారాల వెంకటేశ్వరరావు, వనిమిశెట్టి రాజ, విల్ల వెంకటేశ్వరి పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బాధిత కుటుంబాలకు వర్మ పరామర్శ

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల బాధిత కుటుంబాలను టిడిపి అధికార ప్రతినిధి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎన్ వర్మ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మంగళవారం కొండవరంలో ఆయన పర్యటించి జోగురాజుపేటకు చెందిన పులగల ఏసుబాబును, వాసంశెట్టి అప్పన్న, ఎంద్ర వెంకటరమణ ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో వారిని పరామర్శించి ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున అందజేశారు. అందించారు. ఆయనవెంట కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, గాది రాజబాబు, వేమగిరి రాంబాబు, రాయుడు సత్య వేణి పాల్గొన్నారు.

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌తో రిలయన్స్ సిఎస్ఆర్ ప్రతినిధులు

రిలయన్స్‌కు రెడ్ క్రాస్ బంగారు పతకం

ప్రజాశక్తి - కాకినాడ

చమురు ఉత్పత్తి సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీకి రెడ్ క్రాస్ బంగారు పతకం లభించింది. 2021-22లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపట్టిన పలు సేవకార్యక్రమాలు, రెడ్ క్రాస్ జిల్లా యూనిట్ కు అందించిన సహకారం గుర్తించిన రెడ్ క్రాస్ సొసైటీ ఆ సంస్థకు పతకం అందించింది. విజయవాడలోని రాజ్ భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుండి రిలయన్స్ సీఎస్సార్ ప్రతినిధి పోతాప్రగడ సుబ్రహ్మణ్యం పతాకాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా సుబ్రహ్మ ణ్యంను పలువురు అభినందించారు.

3 నుంచి విశ్వకర్మ పాదయాత్ర

జిల్లా విశ్వకర్మ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల రామకృష్ణ

ప్రజాశక్తి - గండేపల్లి

కాకినాడలో డిసెంబర్ 3వ తేదీన ఉదయం ప్రారంభమయ్యే విశ్వ బ్రాహ్మణ పాదయాత్రను విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా విశ్వకర్మ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల రామకృష్ణ పిలుపు నిచ్చారు. మంగళవారం గండేపల్లి మండల విశ్వ మండల బ్రాహ్మణ సంఘ సభ్యులను పాదయాత్రకు ఆహ్వానిస్తూ సంఘ సభ్యుడు తణుకు చిన్నయ్య, వీరమల్ల బ్రహ్మానందంలను ఆయన సన్మానం చేసి పాదయాత్రకు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి ఉపాధి లేకుండా ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేట్ సంస్థలు వచ్చి పొట్ట కొడుతున్నారన్నారు. విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం వచ్చేనెల 3న కాకినాడ నుంచి అన్నవరం దేవాలయం వరకు రెండు రోజులపాటు జరిగే పాదయాత్రను విశ్వబ్రాహ్మణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంఘ సభ్యులు ఆహ్వానిస్తున్న రామకృష్ణ

తాండ నదిపై తాత్కాలికంగా రైతులు వేస్తున్న వంతెనను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీనివాస్

తాండవపై వంతెన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - కోటనందూరు

తాండవ నదిపై బొద్దవరం గ్రామ సమీపంలో రైతులు శ్రమదానంతో చేపట్టిన తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను ఎంపిపి లగుడు శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో సుమారు 4,500 మందికి పైగా రైతులు 5800 ఎకరాలలో కాయగూరలు, వరి, మినుములు అరటి పంటలను సాగు చేస్తారు. పంటలను మార్కెట్‌కు తరలించడానికి తాండవ నది అడ్డంగా ఉండడం వల్ల సరుకులు తరలించడానికి రైతులు సుమారు 9 కిలో మీటర్ల దూరం వెళ్లవలసిన పరిస్థితి ఉంది. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల స్థితినిస్థానిక సర్పంచ్ వాగి అప్పలనాయుడు ఎంపిపి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. బొద్దవరంలో రైతులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా ఎంపీపీ లగుడు శ్రీనివాస్ పరిశీలించి, మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు జిగతల కోట సత్తిబాబు ఎంపిటిసి రెడ్డి స్వామి నాయుడు, దొడ్డ బాబ్జి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రమాద సమయంలో ప్రథమ చికిత్సతో ప్రాణం నిలబెట్టవచ్చని అపోలో హాస్పిటల్ వైద్యులు రాజేష్ తెలిపారు. కోరంగి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం బిలియన్ హార్ట్స్ బీటింగ్ సంస్థ బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు సంఘటన స్థలంలో వెంటనే బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భవాని, కళాశాల సెక్రటరీ పి. కనకరాజు , డైరెక్టర్ చిట్టూరి కల్కిమూర్తి, ఇతర ఉపాధ్యాయులు, ఏ.వో. మాల పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

టిడిపి నూతనంగా ప్రారంభిస్తున్న ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను మంగళవారం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ముఖ్య అతిథిగా హాజరై వారి స్వగృహంలో ఈ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆనందరావు మాట్లాడుతు ఈ కార్యక్రమాన్ని నాయకులు కార్యకర్తలు అందరూ బాధ్యతగా నిర్వహించాలన్నారు. జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి అల్లాడ సోంబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికారప్రతినిధి కర్రీ రామస్వామి,జిల్లా తెలుగుమహిళా అధ్యక్షులు పెచ్చెట్టి విజయలక్ష్మి, జిల్లా తెలుగురైతు అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకరావు, తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** వైసిపి అరాచక పాలనకు ముగింపు పలకాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు ఇంటి వద్ద1 క్లస్టర్ పరిధిలో క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్‌కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు సమావేశం లో ఆయన మాట్లాడారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఇదేంకర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో వైసిపి నాయకులు చెప్పిన అసత్యాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి ముదునూరివెంకటరాజు, ముళ్ళపూడి భాస్కర్‌రావు, బండారు సంజీవ్, సర్పంచులుమెర్ల శ్రీరామచంద్రమూర్తి, జే. హరిబాబు, పార్టీ నేతలుపాల్గొన్నారు. **ఆలమూరు** టిడిపి నాయకులు పార్టీ తరపున చేపట్టనున్న కార్యక్రమాల్లో పాల్గొన్లాని నియోజకవర్గ యువ నాయకుడు బండారు సంజీవ్ అన్నారు. చొప్పెల్లలో మండల పార్టీ అధ్యక్షుడు మెర్ల గోపాల స్వామి అధ్యక్షతన ఆయన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సంజీవ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో వచ్చిన తప్పులపై మార్పులకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

అధికారుల అత్యుత్సాహం వల్లే సస్పెన్షన్లు

- పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జి

ప్రజాశక్తి-కరప

జిల్లాలో ఉపాధ్యాయులపై సస్పెండ్ చర్యలు అధికారుల అత్యుత్సాహంతో ఇటీవల ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఆరోపించారు. మంగళ వారం ఆయన కరప జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఇటీవల విద్యార్థికి కొట్టారన్న అభియోగంపై సస్పెండ్ అయిన తెలుగు టీచర్‌ను సంఘటన పై వివరాలు తెలుసుకునేందుకు హెచ్ఎం లీలా మనోహర్ కలిసి వివరణ కోరారు. దీనిపై హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి తల్లిదండ్రులు ఎవరు ఫిర్యాదు చేయలేదని విద్యార్థి మర్నాడే పాఠశాలకు వచ్చి ఆడుకున్నాడని తమ ఉపాధ్యాయుడిని అకారణంగా సస్పెండ్ చేశారని వివరించారు. ఆ ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఆ సబ్జెక్టులో విద్యార్థులు వెనకబడిపోతు న్నారన్నారు. వెంటనే ఆయన్ని విధుల్లోకి తీసుకునే ఏర్పాట్లు చేయాలని కోరారు. తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ సంఘటన జరిగినప్పుడు నుండి విద్యార్థులు తప్పుచేసిన చదవకపోయినా భయం చెప్పేందుకు తాము భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ సంఘటన పైన జిల్లా కలెక్టర్ తో చర్చిస్తానని రెండు రోజుల్లో సస్పెన్షన్ ఎత్తివేస్తామని, లేని పక్షంలో తానే స్వయంగా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతానని తెలియజేశారు. ఆయన వెంట యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకర్ వర్మ, కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి టి చక్రవర్తి మండల గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మండల ప్రధాన కార్యదర్శి టి.శ్రీరామ్ పి.రాజబాబు, ఇతర మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు.

కరప హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జి

27 చోరీ కేసుల్లో 15 మంది అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జిల్లా నాలుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కాకినాడ వన్ టౌన్, ఇంద్రపాలెం, పిఠాపురం టౌన్, తుని టౌన్ పోలీస్ పరిధిలో 27 చోరీ కేసుల్లో 15 మందిని అరెస్ట్ చేసి సుమారు రూ.32,53,000 విలువ గల 237 గ్రాముల బంగారు ఆభరణాలు, 321 గ్రాముల వెండి ఆభరణాలు, 32 సెల్ ఫోన్లు, 22 మోటార్ సైకిళ్లు, రూ.4,77,500 సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు రూ.12 లక్షల 59 వేలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు, మరొకరిని అరెస్టు చేసి అతను వద్ద నుండి రూ.25 వేల విలువైన వెండి, బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నారన్నారు.

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఇంటిలో చోరీ చేసిన నేరస్థుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ. లక్షా 25 వేల రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పిఠాపురం సర్కిల్ పరిధిలో మోటార్ సైకిళ్లు దొంగలించే ఐదుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు రూ.10 లక్షల 64 వేల విలువ గల 22 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేకున్నామన్నారు. తుని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి ఒక సెల్ ఫోన్ షాప్ తాళాలు పగలుగొట్టి సెల్ ఫోన్లు చోరీ చేసిన ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. ఆరు లక్షల విలువైన 31 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీటితో పాటు తుని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసులో ఒక వ్యక్తి బ్యాగ్ నుండి నగదు చోరీ చేసిన ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్‌చేసి వారి వద్ద నుండి రూ. లక్షా 80 వేలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. డిజిపి దిశానిర్దేశాల మేరకు, కాకినాడ జిల్లా అడి షనల్ ఎస్‌పి(అడ్మిన్) పి.శ్రీనివాస్ నేతత్వంలో, డి.ఎస్.పి.లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, సిబ్బంది నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారన్నారు. చాకచాక్యంగా ఈ నేరస్థులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఇటీవల కాకినాడ వన్ టౌన్ స్టేషన్ పరిధి మల్లిపూడి వారి వీధిలో ఈ నెల 29న ఇంటి యజమాని ఇంటికి తాళం వేసి, ఊరు వెళ్లిన సమయములో రాత్రి ఇంటి తాళం పగుల గొట్టి ఇంటిలోనికి ప్రవేశించి, బంగారు వస్తువులు, నగదు చోరీ కేసులో ఈ కేసులో ఓలేటి శ్రీలక్ష్మి, ఆమె భర్త అయిన ఓలేటి వీరబాబులను అరెస్ట్ చేసి, వారి నుండి సుమారు 181 గ్రాముల బంగారం, సుమారు 201 గ్రాముల వెండి వస్తువులు, రూ.4,32,500 నగదును మొత్తం విలువ 12.59 వేలు స్వాధీనము చేసుకున్న మన్నారు. ఈ కేసులను చేధించిన కాకినాడ, పెద్దాపురం, సి.సి.ఎస్. డి.ఎస్.పి. లను, కాకినాడ 1 టౌన్, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని టౌన్ సి.ఐ.లను, ఎస్.ఐ.లను, సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌పితో పాటు, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్, అడిషనల్ (రిజర్వ్) బి. సత్యనారాయణ, ఎస్.బి. డి.ఎస్.పి.యం.అంభికా ప్రసాద్, కాకినాడ డిఎస్‌పి పి. మురళీ కష్ణారెడ్డి, పెద్దాపురం డిఎస్‌పి ఎస్.మురళీ మోహన్, సిసిఎస్ డిఎస్‌పి ఎస్. రాంబాబు, కాకినాడ వన్ టౌన్ సిఐ వి.కష్ణ, పిఠాపురం సి.ఐ. శ్రీనివాస్, కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాస్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు

పాడి రైతులకు పెయ్యదూడల ఉత్పత్తి పథకం

పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ తాతయ్య

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

ఎపీ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు ఎంతో ప్రయోజన కరమైన పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, యన్‌జిఒ, ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకుని తద్వారా గ్రామాల్లో పాల ఉత్పత్తి అభివృద్ధికి తోడ్పడాలని సామర్లకోట పశు సంవర్ధక శాఖ ఎడి డాక్టర్ కె తాతయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సామర్లకోట ఏరియా పశువుల ఆసుపత్రిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తి పథకంలో పాడి గేదెల ఒక్కంటికి పెయ్యి దూడకు రూ. 1350 వ్యయం కాగా అందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.850కాగా రైతు రూ.500 చెల్లించాల న్నారు. ఒకవేళ ఇరవై రోజుల్లో మళ్లీ ఎదకు వస్తే రెండవసారి ఉచితంగా ఇంజక్షన్ చేస్తారన్నారు. రెండవ సారి కూడా గర్భం రాకుంటే రూ. 500 తిరిగి రైతు బ్యాంక్ అకౌంట్‌కి జమచేస్తారన్నారు. ఒకవేళ పేయ్యి దూడ కాకుండా పోతు దూడ పుడితే రూ.250 తిరిగి రైతు బ్యాంక్ అకౌంట్‌లో వేస్తారు. అలాగే లంపీ వ్యాధి రాకుండా వ్యాక్సిన్ కూడా పశువులకు వేస్తున్నా మని ఎడి తాతయ్య వివరించారు. సమావేశంలో పశువైద్యులు డాక్టర్ రవివర్మ పాల్గొన్నారు.

సోమేశ్వరంలో ఢీకొన్న లారీ, వ్యాన్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -రాయవరం

సోమేశ్వరం శివారు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెల్ల గ్రామానికి చెందిన వి.సత్యనారాయణ చార్యులు కారు బలభద్రపురం నుంచి చేప పిల్లల లోడుతో అమలాపురం వస్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానికులు రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గోదావరిలో దూకిన వ్యక్తిని రక్షించిన మత్స్యకారులు

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం బోడసకుర్రు బ్రిడ్జిపై నుండీ మంగళవారం దూకిన వ్యక్తిని స్థానిక మత్స్యకారులు కాపాడారు. రాజోలు మండలం కడలి గ్రామం చెందిన కొండేటి లక్ష్మణరావు సాయంత్రం బ్రిడ్జి పై నుంచి దూకడంతో బొడసకుర్రు గ్రామానికి చెందిన బొమ్మిడి సత్యనారాయణ, అతని కుమారుడు వెంటనే బోటు మీద వెళ్లి ఒడ్డుకు తీసుకొచ్చారు. ప్రాణాపాయం నుంచి బయటపడిన లక్ష్మణరావును కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా లక్ష్మణరావును ప్రాథమిక చికిత్స కొరకు అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

లక్ష్మణరావును కాపాడిన మత్స్యకారులు

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

గుత్తెనదీవి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాఘవేంద్రపురం గ్రామానికి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జగనన్న కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.4లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. మల్లాడి కమల తాటాకింటిలో ఉంటూ ప్రభుత్వం ఇచ్చిన గృహన్ని నిర్మించుకుంటున్నారు. కమల కుమారుడు భవానీ మాల వేసుకొని దీపారాధన చేసి బయటకు వెళ్లారు. ఇంతలో మంటలు వ్యాపించటంతో స్థానికులు మంటలను ఆర్పారు. ఇంటిలో ఉన్న సామగ్రి, దుస్తులు ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. పక్క నున్న మల్లాడి సత్యవేణి తాటాకు ఇల్లు పాక్షికంగా కాలింది. మంగళవారం అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, సొసైటీ అధ్యక్షులు కశిలింక నరసింహమూర్తి, సర్పంచ్ భర్త లంకలపల్లి మునిరాజు చేరుకున్నారు. ప్రభుత్వ నుంచి సహాయమందించేలా కృషి చేస్తామని తెలిపారు.

గుత్తెనదీవిలో దగ్ధమవుతున్న తాటాకిల్లు

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెం జాతీయ రహదారిపై మద్యం షాపు వద్ద మంగళవారం తెల్లవారుజామున డివైడర్ పైకి లారీ దూసుకుపోయింది. ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెనుముప్పు తప్పింది. డివైడర్ వద్ద సరైన సిగ్నల్ లేకపోవడం శీతాకాలం వల్ల పొగ మంచుతో కూడి క్లియరెన్స్ లేకపోవడం వల్ల ఈ ప్రాంతంలో ప్రమాదాలు నిరంతరం జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఉండటంవల్ల వినియోగదారులు హైవే రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలుకు గురవుతున్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
E.A. 112/2022
EPSR 395/2021
O.S. 368/2017
Between:
1. Chappidi Brahmaji
2. Marukurthi Naga Ravi Chandra Sekhar Yadav ...DHrs
AND
Bajana Rambabu, S/o. Venkata Rao, Hindu, aged 40 years, Business, D.No. 5-96, Palacherla Sivaru, Sriramapuram Village, Rajanagaram Mandal, East Godavari District ...JDr
పై నంబరు దావాలో JDr అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 23-12-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 27-11-22
దాసరి సంజయ్‌గుప్త
అడ్వకేటు, రాజమండ్రి

నేరాలు ఘోరాలు

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తాళ్లరేవు

తాళ్లరేవు మండలంలో ఈనెల 28వ తేదీన ఇంజరం వంతెనపై వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైన గాయపడిన వ్యక్తి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కోరంగి ఎస్.ఐ. పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కాట్రేనికోన మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి మహేష్ (31) ఈనెల 28వ తేదీ తెల్లవారు జామున 2:30 గంటల సమయంలో యానాం - ద్రాక్షరామ రహదారిలోని వంతెనపై బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలు పాలైన మహేష్‌ను స్థానికులు యానం జీ.జీ.హెచ్.కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -కాట్రేనికోన

30 గ్రాముల గంజాయి కలిగిఉన్న కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన షేక్ నబీ సాహెబ్ ను కాట్రేనికోన పోలీసులు అరెస్ట్ చేశారు. రాజమహేంద్రవరం బ్లేడ్ బ్యాచ్ తో పరిచయం పెంచుకున్న నబీ సాహెబ్ గంజాయికి అలవాటు పడినట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ఐ టి.శ్రీనివాస్ చెప్పారు.

గర్భిణి మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి -కాట్రేనికోన

ఐ.పోలవరం మండలం కరవాక లంకకు చెందిన నాలుగు నెలల గర్భిణి బొమ్మిడి రామలక్ష్మి(21) గర్భ విచ్ఛిత్తి కారణముగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. కరవాక లంకకు చెందిన వినోద్ కుమార్ కు కాట్రేనికోన మండలం గెద్దనపల్లి శివారు పోరపేటకు చెందిన బండి రామలక్ష్మితో ఏడాదిన్నర క్రితం వివాహం అయింది. పెళ్లి అయిన నాటి నుంచి భర్త వినోద్ కుమార్ అదనపు కట్నం వేధింపులకు గురి చేస్తున్నట్లు మృతురాలి తండ్రి బండి అప్పారావు వాపోయాడు. తమ కుమార్తెను అల్లుడే పొట్టన పెట్టుకున్నాడని బోరున విలపించాడు. నాలుగో నెల గర్భిణీగా ఉన్న కుమార్తె కు గర్భ విచ్ఛిత్తి మాత్రలు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందిందన్నారు. మృతికి కారణమైన వినోద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి అప్పారావు కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహారాజశ్రీ 4వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 166/2021
Between:
ICICI Bank Limited, Rep. by its Debt Manager and GPA Holder: Sankara Rao Ramisetty, S/o. Narasinga Rao, Hindu, aged 28 years, Rajamahendravaram. -వాది
AND
Bandlamudi Sandeep Raj, S/o. Naga Raju, Hindu, aged 41 years, D.No. 87-1-2/3, SCG Complex, Opposite RTC Complex, Rajamahendravaram. -ప్రతివాది
పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 08-12-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి 29-11-2022
డి.వి.కృష్ణారావు
అడ్వకేటు, రాజమండ్రి

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ. నెం. 90/2022
ఇ.పి. నెం. 16/2015
ఓ.ఎస్. నెం. 214/2014
బిట్వీన్:
షేక్ మస్తాన్ ...పిటిషనరు/డి. హెచ్. ఆర్
మరియు
కూర్మా శ్రీ పట్టాభి, తండ్రి: వెంకటస్వామి, డోరు నెం. 59-12-4, లిబర్టీ స్కూల్ వీధి, పి అండ్ టి కాలనీ, రాజమండి అర్బన్.
...రెస్పాండెంటు/ జె.డి.ఆర్
ఈ నంబరులో Dhr కి రావలసిన డిక్రీ బాకీ వసూలు నిమిత్తం Jdr తాలూకు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని వేలం వేయించడం ద్వారా వసూలు ఇప్పించుమని పై నంబరు E.P. దాఖలు చేసి ఉన్నారు. సదరు E.P. లో దక్షిణపు హద్దును అరిగెల నాగేశ్వరరావు గారి తాలూకు భూమి బదులుగా యర్రంశెట్టి సత్యవతి గారి భూమిగా సవరణ చేయుటకు పర్మిషను ఇప్పించుమని దాఖలు చేసిన ఇ.ఎ. నెం. 90/2022 రులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకోనందున కోర్టు వారు పబ్లికేషను ద్వారా నోటీసులు ఆర్డరు వేసినారు. సదరు పిటిషను వాయిదా ది. 05-12-2022 అయి ఉన్నది. కావున సదరు తేదీని పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజర్జ మనవి చేసుకోవలెను. లేనిచో పిటిషను పరోక్షమందు తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
శ్రీ ఎన్.వి.కె.శర్మ, అడ్వకేట్
అమలాపురం, సెల్: 9849142007
9849276623